సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం, 3, ఫిబ్రవరి, 2025



జగన్మాతా పాహిమాం

జోగుళాంబ అమ్మవారు సోమవారం నిజరూప దర్శనం ఇవ్వనున్నారు.

వివరాలు 8లో ▸



లక్ష్మీచెన్నకేశవుడి కల్యాణం

గంగాపురం లక్ష్మీచెన్నకేశవుడి కల్యాణం కనుల పండువలా నిర్వహించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /13.7

మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. ఉదయం, రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లాలో 43 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 7,839 మంది విద్యార్థులు

కందనూలు: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24వ తేదీ వరకు నాలుగు దశల్లో పరీక్షలు కొనసాగనున్నాయి. జనరల్ ద్వితీయ సంవత్సరం 5,157 మంది, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం 1,412 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,270 మందితో కలిపి మొత్తం 7,839 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. వీరి కోసం జిల్లావ్యాప్తంగా 43 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఐఈఓ వెంకటరమణ వెల్లడించారు. మొదటిసారిగా డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ లేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్లాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, డీఈసీ స్క్వాడ్, ఒక కన్వీనర్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాత అలైన్‌మెంట్ ప్రకారం హైవే నిర్మించాలి



తాడూరు: పాత అలైన్‌మెంట్ ప్రకారమే 167కే నంబర్ జాతీయ రహదారిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి నిర్మాణంతో రైతులు కోల్పోతున్న పంట పొలాలను ఆదివారం సీపీఎం జిల్లా ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల భూముల్లో జాతీయ రహదారి నిర్మించడం దుర్మార్గమన్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం జాతీయ రహదారిని నిర్మించకుండా పేద రైతులకు అన్యాయం చేయాలని చూస్తే సహించమన్నారు. దళితుల భూముల్లో రహదారి నిర్మాణం కోసం అధికారులు సర్వే చేస్తున్న క్రమంలో తాడూరుకు చెందిన మంచాల శేఖర్ పురుగుమందు తాగగా.. మరో రైతు చింత కురుమూర్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారన్నారు. దీన్ని బట్టి పేద రైతులపై అధికారులు, పెత్తందారులు ఎంత ఒత్తిడి చేస్తున్నారో అర్థమవుతుందని అన్నారు. దళితులు, బీసీ, బడుగు బలహీన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాస్ కాశన్న, శంకర్, బలరాం, అశోక్, సత్తి, టి.కాశన్న పాల్గొన్నారు.

మార్కెట్‌కు 3,760 క్వింటాళ్ల వేరుశనగ



కల్వకుర్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఆదివారం వేరుశనగ భారీగా అమ్మకానికి వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి 316 మంది రైతులు 3,760 క్వింటాళ్ల వేరుశనగను తీసుకురాగా.. గరిష్ఠంగా రూ.6,389, కనిష్ఠంగా రూ. 4,069, సరాసరి రూ.6,069 ధరలు వచ్చాయి.

పంచాయతీల్లో నిధుల లేమి!



- నిలిచిన కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంట్స్
- పల్లెల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

– తాడూరు

వివరాలు 9లో..

కల్తీమయం..!

హోటళ్లు, రెస్టారెంట్లలో నాసిరకం ఆహారం



- భోజనంలో బొద్దింకల దర్శనం
- నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకుంటున్న వినియోగదారులు
- జిల్లాలో 33 రోజుల్లో 8 కేసులు నమోదు



జిల్లా కేంద్రంలోని హోటల్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: మనిషి ఆహారపు అలవాట్లతో పాటు ఆరోగ్యశైలిలో అనేక మార్పులు వస్తున్నాయి. కొందరు ఉద్యోగ, వ్యాపార రీత్యా బిజీ లైఫ్‌తో ఇంట్లో వండిన ఆహార పదార్థాలను తీసుకోకుండా.. ఉదయం టిఫిన్ నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనం వరకు హోటళ్లు, రెస్టారెంట్లలో తింటున్నారు. అయితే జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యం వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతలేని భోజనం, ఇతర ఆహార పదార్థాలను విక్రయిస్తూ రోగాల బారిన పడేలా చేస్తున్నారు. ఇటీవల పలు హోటళ్లు, రెస్టారెంట్లలో కస్టమర్లకు నాణ్యతలేని భోజనం అందించడం.. ఆహార పదార్థాలలో బొద్దింకలు వచ్చిన సంఘటనలే ఇందుకు నిదర్శంగా చెప్పవచ్చు. హోటళ్లు, రెస్టారెంట్లలో నాసిరకం ఆహార పదార్థాలతో ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నామని పలువురు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది 15.. ఈ ఏడాది 8 కేసులు

జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాలలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో భోజనం తయారు చేస్తున్న వాటితో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తున్నారు. గతేడాది జిల్లావ్యాప్తంగా 15 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 33 రోజుల్లోనే 8 కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులలో మార్పు రావడం లేదు. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు

- గతేడాది డిసెంబర్ 10న జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో ఉన్న హోటల్‌లో ఓ వ్యక్తి బిర్యానీ తింటుండగా.. బొద్దింక కనిపించింది. దీనిపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.
- జనవరి 7న జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో కొల్లాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు భోజనం చేస్తూ.. సాంబారులో బొద్దింకను గుర్తించారు. దీనిపై హోటల్ నిర్వాహకులను నిలదీయగా.. నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం..



జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యతలేని భోజనాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులకు నోటీసులు జారీ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నాం. హోటళ్లు, రెస్టారెంట్లలో వంట గదులతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఎక్కడైనా నాణ్యతలేని ఆహారాన్ని విక్రయిస్తే ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయండి.

– మనోజ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి, నాగర్‌కర్నూల్

దురుసుగా ప్రవర్తిస్తూ..

జిల్లాలోని ఎక్కడైనా హోటళ్లలో కస్టమర్లకు నాణ్యతలేని భోజనం ఇస్తున్నట్లు గుర్తించి.. నిర్వాహకులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు దురుసుగా ప్రవరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. భోజనం తయారీకి నాణ్యతలేని సరుకులు, వంటనూనె, కూరగాయలు, చికెన్, మటన్ వినియోగిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా భోజనంలో బొద్దింకలు వస్తుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. నాసిరకం ఆహారంతో అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ఆస్కారం ఉంటుందని వాపోతున్నారు. కాగా, హోటళ్లు, రెస్టారెంట్లలోని వంట గదుల్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో బొద్దింకలు చేరి వండిన ఆహార పదార్థాలలో కలిసిపోతున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. హోటళ్లలో వంట గదులతో పాటు పరిసర ప్రాంతాలు, భోజనం నిల్వ ఉంచే ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని.. వండిన ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

కౌలు రైతుకు ‘భరోసా’ కరువు



తెలకపల్లి శివారులో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

- పంటలు సాగుచేస్తున్నా అందని పెట్టుబడి సాయం
- ప్రభుత్వ విధానాలతో దిక్కుతోచని స్థితి
- జిల్లాలో 43వేల మంది కౌలు రైతులు

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రైతుభరోసా పథకం కౌలు రైతులకు అందని ద్రాక్షగా మారింది. గత ప్రభుత్వంలో రైతుబంధు పథకానికి కూడా కౌలుదారులు నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలుదారులకు రైతుభరోసా పథకం వర్తింపజేయాలని డిమాండ్ రావడంతో పరిశీలిస్తామని చెప్పింది. ఈ మేరకు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో జిల్లాలో దాదాపు 43వేల మంది కౌలు రైతులు పంట పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇటీవల రైతుభరోసా పథకం అమలు కోసం క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి.. సాగుయోగ్యం కాని భూముల వివరాలను సేకరించింది. అనంతరం గ్రామసభలు నిర్వహించి, సాగుయోగ్యం కాని భూముల వివరాలను వెల్లడించారు. కానీ ఎక్కడా కౌలు రైతుల విషయాన్ని ప్రస్తావించలేదు. దీంతో రైతుభరోసాపై ఆశపడిన కౌలు రైతులకు మళ్లీ నిరాశే మిగిలింది. అనేక ఇబ్బందులను ఎదుర్కొని పంటలు పండించే కౌలు రైతులు ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదు.

ఎకరానికి రూ. 10వేల పైమాటే..

జిల్లాలో ఎకరానికి కౌలు రూ. 6వేల నుంచి రూ. 12వేల వరకు పలుకుతోంది. భూమిని బట్టి రైతులు కౌలును చెల్లిస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు కేఎల్ఐ ద్వారా సాగునీరు అందుబాటులో ఉండగా.. మరికొన్ని ప్రాంతాల్లో వర్షాధారంపైనే ఆధారపడుతున్నారు. వర్షాధారంగా పంటలను పండించే భూములకు ఏడాదికి రూ. 6వేల వరకు.. సాగునీరు పారే భూములకు రూ. 10వేల నుంచి రూ. 12వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. పంటల దిగుబడితో సంబంధం లేకుండా కౌలును చెల్లించాల్సి ఉండటం.. పంటలకు ఆశించిన మేర ధరలు లభించకపోవడం వంటి కారణాలతో కౌలు రైతులు నష్టపోతున్నారు. ఒక్కోసారి పంట పండక పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఎంతో మంది కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

గతేడాది రూ. 4లక్షలు నష్టం



గతేడాది ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. అధిక వర్షాలతో పంట పండక రూ. 4లక్షల నష్టం వచ్చింది. కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అవసరం. ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా అందించి కౌలు రైతులను ఆదుకోవాలి.

– ఆవుల రాజు, పోతిరెడ్డిపల్లి, తిమ్మాజిపేట మండలం

ఎలాంటి ఆదేశాలు రాలేదు..



కౌలు రైతుల గుర్తింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు, విధివిధానాలు వస్తే వాటిని అనుసరిస్తాం.

– చంద్రశేఖర్, డీఏఓ

అన్ని పథకాలకు దూరం..

కౌలు రైతులకు ఎక్కడా అధికారిక గుర్తింపు లేకపోవడంతో రాష్ట్ర, కేంద్ర పథకాలకు నోచుకోవడం లేదు. రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టే ఏ ఒక్క పథకం వీరి దరి చేరడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రైతుభరోసా వంటి పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారు. ఇక కనీసం బ్యాంకు రుణం సైతం పొందలేని దుస్థితి నెలకొంది. వ్యవసాయ పొలాల కౌలు, పంట పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు చేస్తూ.. తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అసలైన కౌలు రైతులను గుర్తించి.. అన్ని రకాల సాయం అందేలా చూడాలని కోరుతున్నారు.

నైతిక విలువలకు శతక ప్రక్రియ దోహదం



వాణి శతకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సాహిత్య రంగానికి తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఐదేళ్ల వార్షికోత్సవ వేడుకలను ఆదివారం జిల్లాకేంద్రంలోని స్కాట్స్ అండ్ గైడ్స్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు, ప్రముఖ కవయిత్రి రావూరి వనజ రచించిన ‘వాణి శతకం’ పుస్తకావిష్కరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పిల్లల చేత రామాయణం, భాగవతాలు చదివించాలన్నారు. నైతిక, మానవతా విలువలకు శతక ప్రక్రియ దోహదపడుతుందన్నారు. ఆచార్య మసన చెన్నప్ప మాట్లాడుతూ వేదాలు, శాస్త్రాలు, కావ్యాలు వాణి కరుణ వల్లనే ఆవిర్భవిస్తాయన్నారు. వాణిశతకం భక్తి ప్రపత్తులతో కూడుకున్నదని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, డాక్టర్ పొద్దుటూరి ఎల్లారెడ్డి, మనోహర్‌రెడ్డి, చుక్కాయపల్లి శ్రీదేవి, నలవోలు నర్సింహారెడ్డి, జి.శాంతారెడ్డి, టి.శ్రీలక్ష్మి, పురుషోత్తంరెడ్డి, విజయ్‌కుమార్, రావూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.



సరస్వతీ నమస్తుభ్యం

జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో ఆదివారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్‌కుమార్ శర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ 300 మంది చిన్నారులతో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆకారపు విశ్వనాథం, ఈశ్వరయ్య, వలిశెట్టి లక్ష్మీశేఖర్, శివశంకర్ పాల్గొన్నారు.

– కందనూలు

ఒత్తిడి వీడి.. లక్ష్యంపై గురి

ఇంటర్ పరీక్షల వేళ విద్యార్థులపై విద్య, వైద్య శాఖల ప్రత్యేక శ్రద్ధ

- టెలిమానస్ ద్వారా నిపుణులతో మానసిక కౌన్సెలింగ్
- ఇప్పటికే 15 కళాశాలల్లో మొదటి దశ అవగాహన సదస్సులు పూర్తి
- అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్ 14416.. రెండు నెలల్లో 300కి పైగా కాల్స్
- ఉమ్మడి జిల్లాలో సత్ఫలితాలిస్తున్న కార్యక్రమం



మహబూబ్‌నగర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ (ఫైల్)

పాలమూరు: సాధారణంగా పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి అధికంగా ఉంటుంది. దీనిని అధిగమించలేక చాలామంది సతమతమవుతుంటారు. ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్నాయి. అలాగే సోమవారం నుంచి మొదలయ్యే ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. అయితే పరీక్షలు బాగా రాయలేమోనని.. ఫెయిలవుతామోనని.. భవిష్యత్ ఏమవుతుందోనని.. కొందరు ఆందోళన చెందుతుంటారు. ఇలాంటి సమయంలో విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు వైద్య, ఆరోగ్య శాఖ– ఇంటర్ విద్యాశాఖ సంయుక్తంగా టెలిమానస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కౌన్సెలింగ్ ద్వారా వారిలో ఒత్తిడిని తగ్గిస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా టోల్‌ఫ్రీ నంబర్ 14416 అందుబాటులోకి తీసుకురాగా.. ఇప్పటికే 300లకుపైగా కాల్స్ వచ్చాయి. అలాగే జిల్లాలోని 15 ఇంటర్ కళాశాలల్లో ఇప్పటికే టెలిమానస్ ద్వారా మొదటి దశ అవగాహన సదస్సులు నిర్వహించగా.. రెండో దశ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

సానుకూల దృక్పథం కల్పించేలా..

పరీక్షలంటే భయం వీడేలా విద్యార్థులకు విద్య, ఆరోగ్యశాఖ సంయుక్తంగా కలిసి మానసిక వైద్య నిపుణులతో అవగాహన కల్పిస్తున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకునేందుకు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ (స్వీయ ఆత్మవిశ్వాసం) పెంపొందించుకునేందుకు, సామాజిక మాధ్యమాలను కొన్నాళ్లపాటు పక్కన పెట్టేందుకు, దురలవాట్లకు దూరంగా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నారు.

- విద్యార్థుల మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనించేందుకు కళాశాలల వారీగా ఇద్దరు చొప్పున అధ్యాపకులను నియమించారు.
- విద్యార్థులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినా మానసిక స్థిరత్వాన్ని ఎలా పెంచుకోవాలనే అంశంపై మానసిక వైద్య, విద్యా నిపుణులు సూచనలు చేస్తున్నారు.
- చదువుల ప్రణాళిక, సమయ నిర్వహణ, ఒత్తిడి నియంత్రణ పద్ధతులను తెలియజేస్తున్నారు.
- విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా మార్పు తెస్తున్నారు.
- పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల్లో సానుకూల దృక్పథం పెంపొందిస్తున్నారు. మొత్తంగా విద్యార్థులు ఒత్తిడి వీడి.. లక్ష్యంపై గురిపెట్టేలా మార్పు తేవడంలో సఫలమవుతున్నారు.

రెండు నెలల్లో టెలిమానస్‌కు వచ్చిన కాల్స్ ఇలా..

జిల్లా	కాల్స్
మహబూబ్‌నగర్	87
జోగుళాంబ గద్వాల	80
నారాయణపేట	65
వనపర్తి	64
నాగర్‌కర్నూల్	44

అవగాహన కల్పిస్తున్నాం..



పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలా మానసిక ఒత్తిడి తట్టుకోవాలి అనే అంశంపై ప్రధానంగా వారికి అవగాహన కల్పిస్తున్నాం. పరీక్షలు సమీపిస్తున్న వేళ భయం పెరిగిపోయి.. మానసికంగా ఇబ్బంది పడుతుంటారు. ఈ క్రమంలో ఆత్మహత్యల వైపు ఆలోచనలు వెళ్తుంటాయి. వీటిన్నింటిని ఎలా అధిగమించాలో క్లుప్తంగా సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. పరీక్షల సమయంలో విద్యార్థులు సక్రమంగా నిద్రపోవాలి. మంచి ఆహారం తీసుకోవాలి. పిల్లలను తల్లిదండ్రులు ఎప్పుడూ కూడా ఒత్తిడికి గురిచేయవద్దు. ఎదుటి పిల్లలతో పోల్చవద్దు. పరీక్షలు రాయడం కొత్తకాదని విద్యార్థులు గ్రహించాలి.

– హిమబిందు, టెలిమానస్ సైకియాట్రిక్ కౌన్సిలర్

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి..



చుట్టూ ఉండే వాతావరణం ఇతరులతో పోలిక వంటి వాటి కారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు వారిని అవసరమైన మేర ప్రోత్సహించి నడిపించాలి. చదువు విషయంలో ప్రణాళిక, సమయపాలన ఎంతో ముఖ్యం. కష్టమైన సబ్జెక్టు ఉంటే ప్రతిరోజూ 30 నిమిషాలు చదివేందుకు కేటాయించాలి. కష్టమని పక్కన పెడితే పరీక్షల సమయానికి ఇబ్బంది తప్పదు. మెదడుకు చదువుపై ప్రణాళికబద్ధమైన అలవాటు చేయాలి. నిత్యం ఒకే సమయం లేదా ఒకే ప్రాంతంలో చదువుకునేందుకు అలవాటు చేయాలి. చదువుకునే సమయంలో సెల్‌ఫోన్, టీవీల జోలికి వెళ్లకుండా ధ్యాసంతా పుస్తకాలపైనే పెట్టాలి.

– రమాకాంత్, సైకియాట్రిస్ట్, పాలమూరు మెడికల్ కళాశాల

సమస్యను గుర్తించి..

ఆత్మహత్యలకు పాల్పడడానికి ఆలోచిస్తున్న వ్యక్తికి కుటుంబం, సమాజ మద్దతు చాలా అవసరం. అలాగే సమయానుగుణంగా మానసిక నిపుణుల సహాయం తీసుకోవడం కూడా తప్పనిసరి. సమాజంలో తప్పుగా భావించే ఈ సమస్యను దాచిపెట్టకుండా దగ్గరి వ్యక్తులు దానిపై చర్చించి అలాంటి మానసిక స్థితిలో ఉన్న వ్యక్తికి సహాయపడాలి. ముఖ్యంగా ఈ సమస్య గుర్తించి పరిష్కరించాలనుకొనే వ్యక్తులు అంటే కుటుంబ సభ్యులు కాని, స్నేహితులు కాని అందుకోసం సమయం వెచ్చించడంతోపాటు ఓపిక, సహనంతో అతనికి సహాయడాలి అనే మనస్తత్వంతో ముందుకు సాగాలి. దీంతో అవతలి వారు మానసిక కుంగుబాటులో ఉన్న వ్యక్తి చెబుతున్న దానిని ఓపికగా విని పరిష్కార మార్గాలు చూపుతూ ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

క్లుప్తంగా

ఉరేసుకొని బాలుడి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంట్లో ఉరేసుకొని ఓ బాలుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం జిల్లా కేంద్రంలోని సంతబజార్‌లో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్దన్ తెలిపారు. వివరాలు.. సంతబజార్ కాలనీకి చెందిన గణేష్ కుమారుడు కార్తీక్(13) సినిమాకు వెళ్లేందుకు డబ్బులు అడగడంతో తండ్రి మందలించాడు. ఈక్రమంలోనే తల్లిదండ్రులు ఇంటి నుంచి బయటకు మైనర్‌బాలుడు ఇంట్లో ఉరేసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో తల్లిదండ్రులు ఇంటికి రావడంతో కుమారుడు ఉరేసుకొని ఉండటాన్ని గమనించి జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మైనర్‌బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆకస్మిక మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట శివారులో చేపలు పట్టేందుకు వచ్చి ఓవ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జానంపేటకి చెందిన సాధిక్‌పాష(52) కొన్నేళ్ల నుంచి కుటుంబంతో కలిసి జడ్చర్లలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో చేపలు పట్టేందుకు గాలాలు తీసుకొని జానంపేటకు వచ్చాడు. శివారులోని పెట్రోల్ పంపు వెనుకభాగంలో నేరెడు చెరువు అలుగు కాల్వ వద్ద బొక్క శంకరయ్య పంట పొలం వద్ద కాలువలో చేపలు పట్టాడు. ఈక్రమంలోనే పొలం ఒడ్డుపై ఆకస్మికంగా పడి చనిపోయాడు. కొంతసేపటికి గొర్రెలు మేపే వ్యక్తి చూసి పొలం యాజమాని కుమారుడు రాములుకు సమాచారమిచ్చాడు. గ్రామస్తులు వచ్చి సాధిక్ పాషను గుర్తించి కుటుంబ సభ్యులకు తెలుపగా వారు మృతదేహాన్ని ఇక్కడి నుంచి తీసుకెళ్లారు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత..


శిరీష(ఫైల్)

అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన వివాహిత హైదరాబాద్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానిక తెలిపిన వివరాలు.. కాటవరానికి చెందిన గొల్ల రాజు, శిరీష(25) దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా కొన్నాళ్ల కిందట జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. శామీర్‌పేటలోని ఓ భవనంలో మూడో అంతస్తులో అద్దెకు ఉంటున్నారు. శనివారం సాయంత్రం ఇంటి వద్ద పిల్లలు ఆడుకుంటుండగా కరెంటు తీగలపై పడిన చెప్పును తీయడానికి ప్రయతి్ంచి విద్యుదాఘాతానికి గురై శిరీష మరణించింది. ఆదివారం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

కిందపడి మున్సిపల్ కార్మికుడు..

మక్తల్: ఇంటి నుంచి బయటకు వెళ్తూ కాల్వ వద్ద కిందపడి మున్సిపల్ కార్మికుడు మృతిచెందిన ఘటన ఆదివారం మక్తల్‌లో చోటుచేసుకున్నట్లు ఎసఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. వివరాలు.. మక్తల్‌కు చెందిన బండారి వెంకటేష్(40) మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంగా బాధపడుతున్నాడు. ఎప్పటిలాగే ఇంటి నుంచి ఉదయం 5గంటలకు బయటకు వస్తుండగా కాల్వ దగ్గర కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కొందరు ఈవిషయాన్ని భార్య సుజాతకు సమాచారం అందించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృత్యుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ ..

తాడూరు: చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని పర్వతాయిపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చిట్టి(40) కుటుంబ కలహాలతో జనవరి 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వావి వరసలు మరిచి..

- బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన బాబాయ్

అచ్చంపేట రూరల్: కుటుంబ వ్యవస్థకు మచ్చతెచ్చే విధంగా వరసకు బాబాయ్ అయ్యే ఓ వ్యక్తి బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన అచ్చంపేట మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ వివరాల మేరకు.. గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బాలికతో వరసకు బాబాయ్ అయ్యే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయడంతో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జగన్మాతా పాహిమాం

- నేడు జోగుళాంబదేవి నిజరూప దర్శనం
- సహస్ర ఘట్టాలతో అమ్మవారికి అభిషేకాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తజనం
- నేటితో ముగియనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు


జోగుళాంబ అమ్మవారు


విద్యుద్దీపాల వెలుగులో అమ్మవారి ఆలయం

అలంపూర్: ఐదో శక్తిపీఠం జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు తుది దశకు చేరాయి. సోమవారం అమ్మవారి నిజరూప దర్శనం, సహస్ర ఘట్టాలతో అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల నాలుగో రోజైన ఆదివారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు భక్తులచే కుంకుమార్చనలు, త్రిశతి, ఖడ్గమాల అర్చనలు జరిపించారు. అదే విధంగా చండీ హోమాలు, పవమాన సూక్త పారాయణ, పవమాన సూక్త హోమాలు, ఆవాహిత దేవతా హోమాలు, మండపారాధన, బలిహరణం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.

ఏర్పాట్లు పూర్తి..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నారు. వసంత పంచమి, ఉత్సవాల చివరి రోజున భక్తులకు జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనభాగ్యం కలగనుంది. అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలకు ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు. కలశాలను ధరించి ఊరేగింపుగా వచ్చే భక్తులకు ప్రత్యేకంగా దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు అరటి తోరణాలు ఏర్పాటు చేశారు.

కార్యక్రమాలు ఇలా..

అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఉదయం 8 గంటలకు ఆవాహిత దేవతా హోమాలకు పూర్ణాహుతి సమర్పిస్తారు. గంటల శివాలయంలో జోగుళాంబ సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు జోగుళాంబ జాతర ప్రారంభం కానుంది. అమ్మవారికి సారె తీసుకువచ్చి సమర్పిస్తారు. అదే విధంగా మహాకలశ ఉద్వాసన, అనంతరం సహస్ర ఘట్టాలతో ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. కలశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేస్తారు. అమ్మవారి అభిషేక దివ్య దర్శనం భక్తులకు అనుమతి ఉంటుంది. అభిషేక దర్శన భాగ్యాన్ని భక్తులు నిజరూప దర్శనంగా భావిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుంది. మధ్యాహ్నం అమ్మవారికి అభిషేకాల అనంతరం అలంకారం, భక్తులకు సాధారణ దర్శనాలు ఉంటాయి. సాయంత్రం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. చివరగా ఆలయంలో దశవిధ హారతి అనంతరం ధ్వజా అవరోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు.

150 మంది పోలీసులతో బందోబస్తు..



జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. సీఐ, ఎస్‌ఐలు 10 మంది, హెడ్ కానిస్టేబుల్స్ 20 మంది, కానిస్టేబుల్స్, 20 మందితో పాటు ఉమెన్ పోలీసులు, హోంగార్డులతో కలిపి మొత్తం 150 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల రాకపోకలతో పాటు ట్రాఫిక్ నియంత్రణపై ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు పోలీసులకు సహకరించాలి.

– రవిబాబు, సీఐ, అలంపూర్

భక్తులకు అన్ని సౌకర్యాలు..



అలంపూర్ క్షేత్రానికి వచ్చే భక్తులకు ఏడాదిలో ఒకసారి మాత్రమే జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనం లభిస్తుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగింది. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశాం. తాగునీటి, అన్నప్రసాదాల వసతిలో ఇబ్బందులు లేకుండా చూస్తాం. 25వేల లడ్డూ ప్రసాదాలను సిద్ధంచేశాం.

– పురేందర్ కుమార్, ఈఓ, అలంపూర్

కమనీయం లక్ష్మీచెన్నకేశవుడి కల్యాణం


కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణం కనులపండువలా కమనీయంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య గ్రామ కాళ్లమంటపం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు సంప్రదాయబద్ధంగా ఎదుర్కోలు జరిపారు. భక్తుల చెన్నకేశవ, గోవిందనామస్మరణ మధ్య మంటపం నుంచి ఆలయం వరకు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ కట్ట వద్ద వాటిని ప్రతిష్ఠించి కల్యాణతంతు జరిపించారు. కల్యాణోత్సవానికి దేవాదాయ శాఖ తరపున కార్యనిర్వహణాధికారి దీప్తి పట్టువస్త్రాలు సమర్పించగా.. పలువురు భక్తులు సైతం వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

వైభవంగా పాలెం వెంకన్న కల్యాణం


అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అలువేలు సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ కనుల పండువగా నిర్వహించారు. మొదట విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, కంకణధారణ, కన్యవరణం, మహా సంకల్పం, కన్యాదానం, జీలకర్ర బెల్లం, వరణ మయూరం పూజలు చేశారు. కల్యాణ క్రతువు అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి వడి బియ్యం పోశారు. అనంతరం యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం నుంచి తీసుకొచ్చిన లడ్డు, వడ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.


కల్యాణానికి హాజరైన భక్తులు

మొసలి కలకలం


రాయికోడ్ శివారులోని పొలాల్లో మొసలి

నర్వ: మండలంలోని రాయికోడ్ శివారులోని పొలాల్లో ఆదివారం సాయంత్రం మొసలి కలకలం రేపింది. స్థానికులు, రైతులు తెలిపిన వివరాలలు.. కొన్నిరోజులుగా చెరువులో నుంచి నేరుగా రోడ్డు మీదకు, పొలాల్లో మొసలి తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తుంది. రాత్రి వేళల్లో సైతం రోడ్డుపైన తిరుగుతుండటంతో అటువైపు వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రైతులంతా కలిసి అలజడి చేసే సరికి చెరువులోకి వెళ్లినట్లు వారు తెలిపారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి మొసలిని పట్టుకొని గ్రామానికి దూరంగా వదలాలని స్థానికులు కోరుతున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు.. వేలగొంతులు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం పాలమూరు యూనివర్సిటీలో ఎంఎస్‌ఎఫ్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామికవాదులు మద్దతు తెలుపుతున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యూనివర్సిటీలోని ప్రతి మాదిగ విద్యార్థి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి వచ్చే వారు డప్పు బుజాన వేసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కమలాకర్, రాము, మారుతి, రాజేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో వసంత పంచమి వేడుకలు


అక్షరాభ్యాసానికి హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, కుంకుమార్చనలు, మహా నైవేద్యం, వడిబియ్యం తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. వివిధ ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో బీచుపల్లికి తరలివచ్చి పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి సరస్వతీదేవిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్రాచారి, దినకరన్ ఆచార్యులు 67 మంది చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమ అనంతరం పాలక మండలి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉదండాపూర్ గ్రామస్తులు

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్‌కు చెందిన అక్కా తమ్ముడు భాగ్యలక్ష్మి (6), మహేశ్ (4) గ్రామ సమీపంలో శనివారం ఉదండాపూర్ రిజర్వాయర్ కోసం తొవ్విన గుంతల్లో ప్రమాదవశాత్తు పడి దుర్మరణం చెందిన విషయం విదితమే. వీరిలో అక్క మృతదేహం శనివారమే లభ్యం కాగా.. తమ్ముడి మృతదేహం ఆదివారం లభించింది. కాగా, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలిస్తుండగా.. బాధిత కుటుంబ సభ్యులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. నీటి గుంతల్లో ఎంతో మంది పడి మృత్యువాత పడుతున్నారని.. తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వారన్నారు. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, సీఐ ఆదిరెడ్డి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచనల మేరకు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాలను జడ్చర్ల మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం


ఉమ్మడిజిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

కోస్గి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ గొర్రెల కాపరి మృతిచెందిన సంఘటన మండలంలోని నాచారం సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమలొద్దీన్‌పూర్‌కు చెందిన కుర్వ శివలింగం(25), మునిమోక్షం గ్రామానికి చెందిన కేశవులు తమ గొర్రెలను మేపడానికి బషీరాబాద్ తీసుకెళ్లారు. తిరిగి గత నెల 25న సొంత గ్రామానికి బయలుదేరగా శనివారం రాత్రి సంపల్లికి చేరుకున్నారు. మందలో కొన్ని గొర్రెలు తక్కువ కావడంతో రెడ్డిపల్లికి చెందిన వ్యక్తుల మంద నాచారం శివారులో ఉండటంతో వెతికేందుకు ఆదివారం ఉదయం ఇద్దరూ కలిసి బైక్‌పై బయలుదేరారు. పెట్రోల్‌బంక్ సమీపంలో సడన్ బ్రేక్ వేయడంతో వెనక కూర్చున్న కుర్వ శివలింగం ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు గాయమైంది. వెంటనే 108 వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. తండ్రి కుర్వ భీరయ్య ఫిర్యాదు మేరకు బైక్ నడిపిన కేశవులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు దాటుతుండగా యువకుడు..

జడ్చర్ల: పట్టణంలోని ఫ్లైఓవర్ వంతెన దగ్గర రోడ్డు దాటుతున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. షాబాద్‌కు చెందిన శ్రీను(30) ఆదివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఫ్లై ఓవర్ వంతెన దాటుతుండగా వాహనం ఢీకొంది. వెంటనే 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ..

బిజినేపల్లి: మండలంలోని వెంకటాపూర్ దర్గా వద్ద ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని రహమత్‌బీ బేగం(52) మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం.. రహమత్‌బీబేగం ఆదివారం వెంకటాపూర్ గ్రామంలో దర్గా వద్ద మొక్కు కోసం వచ్చింది. ఈ క్రమంలో ఆమె రోడ్డు దాటుతుండగా నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తుండగా ప్రమాదశావత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

మామిడిలో సస్యరక్షణతో లాభాలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


పూత దశలో ఉన్న మామిడి

అలంపూర్: మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఏడాది మామిడి పంటలో పూత ఆశాజనకంగా ఉందని, పూత రాలకుండా, పిందె దశలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పూత రకాలు..

మామిడిలో ఉండే పూల గుత్తిల్లో రెండు రకాలు పుష్పాలు ఉంటాయి. ఒక రకం ద్విలింగ పుష్పాలు, రెండో రకం మగ పుష్పాలు. ప్రతి పూల గుత్తిలో రకాన్ని బట్టి 200 నుంచి 4 వేల వరకు పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు రకాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు రుమాని రకంలో 0.74 శాతం, నీలం రకంలో 55 శాతం, లాంగ్రా రకంలో 69 శాతం, బంగనపల్లిలో 22 శాతం ద్విలింగ పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు మాత్రమే ఫలదీకరణం చెంది పిందెలుగా ఏర్పడతాయి. మగ పూలు ఫలదీకరణంలో తోడ్పడి తర్వాత రాలిపోతాయి. ద్విలింగ పుష్పాలు కూడా ఫలదీకరణం చెందే ముందే పలు కారణాల వలన రాలిపోతాయి. కొంత వరకు పూత, పిందె రాలడం సహజమే. అయిన వాటి తీవ్రతను బట్టి తగు జాగ్రత్తలు పాటించాలి.

పోషకాల యాజమాన్యం..

మామిడి కాయలు అంగుళం పరిమాణం నుంచి భుజాలు ఏర్పడే వరకు త్వరగా పెరుగుతాయి. ఈ సమయంలో పోషకాలైన నత్రజని, పొటాష్ తప్పక అందించాలి. నీటి వసతి ఉన్న పొలాల్లో చెట్టు వయస్సును బట్టి 500 గ్రాముల నుంచి 1 కిలో వరకు నత్రజని, పిందెలు బాదం కాయ పరిమాణం ఉన్నప్పుడు 300 గ్రాముల పొటాష్ వేసి నీరు పెట్టాలి. నీటి వసతి లేని తోటల్లో నీటిలో కరిగే ఎరువులైన పాలిఫీడ్, మల్టీ-కే ఎరువులు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

హార్మోన్లు..

హార్మోన్ల లోపం, సమతుల్యత దెబ్బతింటే పూత, పిందె బాగా రాలుతుంది. దీని నివారణకు ప్లానోఫిక్స్ అనే మందును 5 లీటర్ల నీటిలో/మి.లీ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. ఈ మందును మోతాదుకు మించి పిచికారీ చేస్తే పిందె రాలిపోయే ప్రమాదం ఉంది.

తేనె మంచు పురుగు..

పూత, పిందె దశలో తేనె మంచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చడం ద్వారా పూత మాడిపోతుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ అనే మందు తగిన మోతాదులో వాడుకోవాలి.

తామర పురుగు..

తామర పురుగులు రసాన్ని పీల్చడం వలన పూత రాలిపోతుంది. పిందె దశలో కాయపై గోకి రసాన్ని పీల్చడం వలన మచ్చలు ఏర్పడతాయి. ఇవి ఆశించిన కాయలపై మంగు ఏర్పడుతుంది. వీటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ/ లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలి.

బూడిద తెగులు..

ఆకులు, పూత, పిందెలపై తెల్లని బూడిద వంటి పొడి ఏర్పడుతుంది. తెగులు సోకిన పూత, పిందెలు రాలిపోతాయి. దీని నివారణకు పూత మొగ్గ దశలో హెక్సాకొనజోల్ మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

భూమిలో తేమ.. నీటి యాజమాన్యం

ఎండాకాలంలో భూమిలోని తేమ ఆవిరి కావడంతో నీటి ఎద్దడికి గురై పూత, పిందె రాలిపోతుంది. నీరు ఎక్కువగా పెట్టినా, వర్షం ఎక్కువగా పడిన పూత, పిందె ఎక్కువగా రాలిపోతుంది. నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు ఆ తర్వాత నెలకు రెండు తడులు ఇవ్వాలి. దీని వలన కాయ రాలడం తగ్గడంతోపాటు నాణ్యత పెరిగి కాయ పరిమాణం కూడా పెరుగుతుంది.